

# శత్రువు

"రేపు మీవాడొస్తున్నాడన్నావుగా? ఇంటికెళ్ళిపోతావా?" ప్రశ్నించాడు రాజారావు.

సంజీవయ్య తల అడ్డంగా ఊపాడు. ఆనంద వృద్ధాశ్రమం డైనింగ్ హాల్లో ఇద్దరూ ఎదురెదురుగా కూర్చుని రాత్రి భోజనం చేస్తున్నారు.

"అదేం?" ఆశ్చర్యంగా అడిగాడు రాజారావు.

సంజీవయ్య నవ్వి "నాకిక్కడ బాగానే వుందిగా?" అన్నాడు.

"బాగానే ఉందిలే. కానీ కొడుకు, కోడలు, మనవలతో హాయిగా కాలక్షేపం చేయడంతో సమానం కాదుగా" అన్నాడు రాజారావు.

సంజీవయ్య ఏం మాట్లాడలేదు. ఇద్దరూ భోజనం ముగించారు. హాల్లో కూర్చుని టీవీలో వార్తలు చూశారు.

రాత్రి ఎనిమిది దాటింది. కాసేపైన తరువాత ఆరుబైట తోటలో సిమెంట్ బెంచీ మీద కూర్చున్నారు.

"ఏమిటోనయ్యా ! నీ సంగతి నాకు అర్థం కావడంలేదు. ఒక్కగానొక్క కొడుకు ఇంటికి రమ్మని వారానికి రెండుమూడుసార్లయినా ఫోన్లు చేస్తుంటే నువ్వు పట్టించుకోవడం లేదు. రేపు స్వయంగా వస్తున్నాడు, మరీ అంత పట్టుదలకు పోకు. ముసలితనంలో ఇంటి పట్టున ఉండడం మంచిది కదా"

రాజారావు మాటలు వింటూ అదోలా చూశాడు సంజీవయ్య. నిర్లిప్తంగా కూర్చున్నాడు.

"నేనైతే వెళ్ళిపోయేవాడిని" అన్నాడు.

సంజీవయ్య నవ్వి ఊరుకున్నాడు.

"ఇక్కడ బాగా అలవాటైపోయింది. సమ వయస్కులతో కాలక్షేపం అవుతూ ఉంది. ఇంటి దగ్గర ఏం కాలక్షేపం అవుతుంది. మా అబ్బాయి, కోడలు ఉద్యోగాలకు, పిల్లలు స్కూలుకు వెళ్తారు ఒక్కడిని ఏం తోస్తుంది చెప్పు" అన్నాడు కాసేపటి తరువాత.

"అదేం కాదులే. అప్పట్లో నీ కొడుకు కోడలు పట్టించుకోలేదని ఇక్కడకు చేరావు. ఇంకా నీకు వాళ్ళమీద కోపం తగ్గలేదు."

"వాళ్ళమీద నాకేం కోపంలేదు."

"చెప్పానుగా"

"నీ కొడుకు మంచివాడే. తన తప్పు తెలుసుకుని నిన్ను బతిమాలుతున్నాడు. ఈ ఆశ్రమంలో వందమంది ఉన్నారు. ఎవరైనా బతిమాలుతున్న కొడుకులున్న వాళ్ళని చూపించు."

"రాజారావు ! నీకు అంతగా లోకజ్ఞానం వున్నట్లు లేదు. అప్పుడు చిన్న చూపు చూసి పట్టించుకోని కొడుకు ఇప్పుడు ఎందుకు బ్రతిమాలాడుతున్నాడంటావ్?" సూటిగా ప్రశ్నించాడు సంజీవయ్య.

"జరిగినదానికి పశ్చాత్తాపపడుతున్నాడేమో?" అన్నాడు రాజారావు.

"నీకు తెలీదులే" అన్నాడు సంజీవయ్య నవ్వుతూ.

★ ★ ★

మర్నాడు ఆదివారం. ఆఫీసుకు సెలవు కావడంతో వెంకట్ భార్యా పిల్లలతో ఆనంద వృద్ధాశ్రమానికి వచ్చారు. రాజారావు, సంజీవయ్య ఒక గదిలో ఉంటున్నారు.

"అంకుల్ ! బాగున్నారా?" రాజారావును పలకరించాడు వెంకట్.

"ఆరోగ్యం ఎలా వుంది అంకుల్?" రుక్మిణి పరామర్శించింది.

"బాగానే వున్నానమ్మా" అన్నాడు రాజారావు.

పళ్ళు తెచ్చి క్యారీబ్యాగ్ టీపాయ్ మీద వుంచింది రుక్మిణి.

"మమ్మీ ! గార్డెన్‌లో ఆడుకుంటాం" అన్నారు పిల్లలు.

"వద్దు. మీరు చెట్లెక్కి కాయలు కోస్తారు" అంది రుక్మిణి.

"రుక్కు ! నువ్వు వాళ్ళని గార్డెన్‌లోకి తీసుకెళ్ళు. ఎంజాయ్ చెయ్యండి పూలు, కాయలు కోయనీయకుండా వాచ్ చేస్తుండు" అన్నాడు.

రుక్మిణి పిల్లల్ని తీసుకుని వెళ్ళింది. తరువాత రాజారావు లేచి వెడుతుంటే "నువ్వెక్కడికి?" అన్నాడు సంజీవయ్య.

"తండ్రీకొడుకులు మాట్లాడుకుంటారుగా? మధ్యలో నేనెందుకు" అని నవ్వాడు రాజారావు.

"కూర్చో ఫర్వాలేదు. మేం సీక్రెట్స్ ఏమీ మాట్లాడుకునేది లేదు" అన్నాడు సంజీవయ్య.

వెంకట్ చాలాసేపు తండ్రిని ఇంటికి వచ్చేయని బతిమాలాడు సంజీవయ్య తనకు ఇక్కడే బాగుందనీ, రావాలనిపిస్తే తనే వస్తానని చెప్పాడు.

కాసేపైన తరువాత అసలు విషయం బయటపెట్టాడు వెంకట్.

"నాన్నా ! ఆ వెయ్యి గజాల స్థలం నాకు రాస్తే డెవలప్‌మెంట్‌కి ఇస్తా మన వాటా అద్దె కిచ్చుకుంటే ఆదాయం వస్తుంది. రోజురోజుకీ రేట్లు మండిపోతున్నాయి. పిల్లల చదువులకు ముందు ముందు చాలా ఖర్చు వస్తుంది"

"ఇప్పుడేం తొందర?" అన్నాడు సంజీవయ్య.

"ఎప్పట్నుంచో ఆ మాట చెప్తున్నావు, రేపు నీకేదైనా అయితే వాటా కోసం వస్తుంది చెల్లాయ్" అన్నాడు వెంకట్.

"నువ్వూ చెల్లెలు బాగానే ఉన్నారు. ఆ స్థలం ఏదైనా మంచి పనికి దానంగా ఇవ్వాలనుకుంటున్నాను" అన్నాడు సంజీవయ్య.

వెంకట్ ముఖం రంగులు మారింది. కోపంతో జేవురించింది.

"అదేంటి నాన్నా ! అంత విలువైన భూమి దానం చేస్తారా?" సీరియస్‌గా అన్నాడు.

తల వూపాడు సంజీవయ్య.

"మా మామగారు కోర్టుకెళ్ళమని ఎందుకు చెప్పారో ఇప్పుడు అర్థమైంది నాకు. నేనే నిన్నీ వయసులో కోర్టుల చుట్టూ తిప్పడం ఎందుకని వూరుకుంటున్నాను" అన్నాడు వెంకట్ అసహనంతో.

"కోర్టుకు వెళ్తే వెళ్ళు. అందులో నీకు ఒక్క గజం రాదు"

"ఎలా రాదో చూస్తాను. నేను నీకు కొడుకుని."

"ఇన్నాళ్ళూ నీకు తెలియని విషయం ఒకటుంది. నువ్వు నా రక్తం పంచుకుని పుట్టినవాడవు కాదు. పెళ్ళయి ఏడేళ్ళయినా పిల్లలు పుట్టకపోయేసరికి నిన్ను అనాధాశ్రమం నుంచి తెచ్చుకుని పెంచుకున్నాం. ఆ తరువాత మాకు ఆడపిల్ల పుట్టింది. అయినా నిన్ను వదలకుండా కన్నకొడుకులా భావించి పెంచాము" సీరియస్‌గా అన్నాడు సంజీవయ్య.

వెంకట్ హతాశుడయ్యాడు. దెబ్బతిన్నవాడిలా వణికాడు. అతని ముఖం తెల్లగా పాలిపోయింది. వెర్రిచూపులు చూశాడు.

"ఇప్పుడు అవన్నీ ఎందుకయ్యా?" రాజారావు సంజీవయ్యను చల్లబరచడానికి అన్నాడు.

"రాజారావు ! ఇదంతా ఎప్పటికైనా తెలుసుకోవాల్సిందే" అన్నాడు సంజీవయ్య.

కొంచెంసేపు నిశ్శబ్దంగా తల వంచుకుని కూర్చుని ఆ తరువాత "వస్తా నాన్నా" అని బయల్దేరాడు.

సంజీవయ్య తల వూపాడు.

★ ★ ★

ఆ రాత్రి భోజనాలయ్యాక తోటలో పచార్లు చేస్తున్నారు రాజారావు, సంజీవయ్య.

రాజారావు హఠాత్తుగా ఆగి "ఎప్పుడో నాలుగైదు సంవత్సరాల క్రితం నువ్వు చెప్పిన విషయం గుర్తుకొస్తోంది" అన్నాడు.

"ఏ విషయం? అడిగాడు సంజీవయ్య.

"పెళ్ళయి ఏడేళ్ళయినా సంతానం కలగలేదని, నీ భార్య గుడులు, గోపురాలు తిరిగేదనీ, చివరకు గర్భం ధరించి కొడుకును కన్నదనీ..."

సంజీవయ్య అర్థోక్తితో అందుకుని "నిజమే...తిరుపతి వెళ్ళి వచ్చాక గర్భం వచ్చింది. అందుకే వాడికి వెంకట్ అని పేరు పెట్టాం" అన్నాడు.

"మరి అదేంటి? నిన్న మీ వాడితో అనాధాశ్రమం నుంచి తెచ్చుకుని పెంచు కున్నామని అన్నావేం? పాపం షాక్ తిన్నాడు" అన్నాడు రాజారావు.

"నా భార్యపోయి పదేళ్ళయింది. నేనీ ఆశ్రమానికి వచ్చి ఏడేళ్ళయింది. ఇన్నాళ్ళూ నన్ను ఇంటికి రమ్మని అడగని కొడుకు, కోడలు ఇప్పుడు ఎందుకు రమ్మని బ్రతిమిలాడు తున్నారనుకుంటున్నావు? ఆస్తి రాయించుకోవడానికి. నేను అమాయకంగా వాళ్ళ మాటలు నమ్మి ఇంటికి వెళ్ళాననుకో... ఆ వెయ్యి గజాల స్థలం రాయించుకుంటారు. తరువాత

నన్ను మళ్ళీ ఇక్కడికి తరిమేస్తారు. అదంతా ముందే ఊహించి నేను రానన్నాను" చెప్పాడు సంజీవయ్య.

"అది సరే... అసలు నువ్వు నాకు పుట్టినవాడివే కాదనడం ఎందుకు?"

"అలా అనకపోతే చాలా గొడవ జరుగుతుంది. వాడి మామ పెద్ద లిటిగెంట్. కోర్టుకు లాగడం అదీ వుంటుంది. వాళ్ళకా ఛాన్స్ ఇవ్వకూడదని అబద్ధం చెప్పాను. ఆస్తుల గురించే కన్నకొడుకులు శత్రువులుగా మారడం చూశాను. వాడు నాకు శత్రువు కాకూడదని పెంపుడు కొడుకని చెప్పాను."

"ఐతే ఆ వెయ్యి గజాలు ఎప్పుడో ఎందుకు రాయించుకోలేదు మీవాడు?"

అప్పుడు ఆ స్థలానికి అంత విలువలేదు. ఇప్పుడు ఊళ్ళో కలిసిపోయి డిమాండ్ పెరిగింది. అందుకే ఇంటికి రమ్మని ప్రేమ ఒలకబోస్తున్నాడు."

"మరిప్పుడా స్థలం ఎవరికైనా దానం చేస్తావా?"

"అవును ఈ రోజుల్లో వృద్ధాశ్రమాల అవసరం బాగా పెరిగింది. ఆ స్థలం నిజానికి నా భార్యకు చెందాలి. నాకు వచ్చిన కట్నం డబ్బుతో వూరి చివర చౌకగా వస్తున్నదని కొన్నాను. నా భార్య ఇప్పుడు లేదు. నా తదనంతరం దాన్ని మన ఆశ్రమానికి చెందేటట్లు విల్లు రాస్తాను. అది అమ్మగా వచ్చిన డబ్బుతో 'సంజీవి రాజ్యం' పేరుతో ఒక బ్లాక్ కట్టించమని కోరతాను. నా పేరు నా భార్యపేరు చిరస్థాయిగా ఉంటుంది. ఏమంటావు?" అన్నాడు సంజీవయ్య

రాజారావు ఆనందంతో తల వూపాడు.

*–ఆంధ్రభూమి మాసపత్రిక మే, 2008*